నగరంలో-నేడు

- బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడిని ఖండిద్దాం.. హిందువులకు బాసటగా నిలబడుదాం.. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మధ్యాహ్నం ఒంటిగంటకు సమావేశం
- వయనాడ్ - ఉత్తరాఖండ్ - హెచ్‌పీ - హైదరాబాద్‌లో ప్రకృతి విపత్తులు..? మ్యాన్‌మేడ్ ఫెల్యూయర్స్..? అనే అంశాలపై జన విజ్ఞాన వేదిక స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు రౌండ్ టేబుల్ సమావేశం
- తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ, జువెనైల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో హైకోర్టు సీ-బ్లాక్ ఆవరణలో ఉదయం 10 గంటలకు హ్యాండ్లూమ్ ఆర్టికల్స్ స్టాల్స్ ప్రారంభించనున్న హైకోర్టు జస్టిస్ సుజయ్ పాల్ తదితరులు


సమావేశంలో మాట్లాడుతున్న టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ

ప్రమాదకరమైన కేబుళ్లను తొలగించండి

- గుట్టలుగా ఉన్న కేబుల్స్‌తో వంగిపోతున్న స్తంభాలు
- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫరూకీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్‌లో ప్రధాన రహదారుల పక్కన విద్యుత్ స్తంభాలపై ప్రమాదకరంగా గుట్టలుగా ఉన్న కేబుళ్లను వారంలో, ఇతర రహదారుల్లో ఉన్న వాటిని రెండు వారాల్లో తొలగించాలని కేబుల్ ఆపరేటర్లను దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫరూకీ ఆదేశించారు. ఖైరతాబాద్‌లోని టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో బుధవారం కేబుల్ ఆపరేటర్స్, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్ సంస్థల ప్రతినిధులు, కేబుల్ అసోసియేషన్ల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. స్తంభాలపై నిబంధనల ప్రకారం కేబుళ్ల ఏర్పాటు చేసుకోవాలని ఆపరేటర్లకు సూచించారు. కరెంట్ స్తంభాలపై సామర్థ్యానికి మించి కేబుల్స్, తీగల బండిల్స్, పలు రకాల టెలికాం పరికరాలను వేలాడదీయడంతో స్తంభాలు వంగిపోతున్నాయన్నారు. కేబుల్స్ చిందరవందరగా రోడ్లపైకి వేలాడుతూ పుట్‌పాత్‌లపై పడుతుండటంతో పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారని అన్నారు. సెక్షన్ల వారీగా పనిచేయని కేబుళ్లను తొలగించేందుకు క్షేత్రస్థాయి అధికారులతో కేబుల్ ఆపరేటర్స్, ఇంటర్నెట్ సర్వీస్ ప్రొవైడర్లతో సమావేశాలు నిర్వహించి తీగలు తొలగించే దిశగా చర్యలు తీసుకోవాలని సీఎండీ ఉన్నతాధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డైరెక్టర్ కె.రాములు, సుధారాణి, జోనల్ చీఫ్ ఇంజనీర్లు కె.సాయిబాబా, నరసింహస్వామి, పి.ఆనంద్, బిక్షపతి, సీజీఓ నారాయణ, కేబుల్ సంఘాల నాయకులు, ఇంటర్నెట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కవితా పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

బర్కత్‌పుర, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు అల్వాల బాల్‌రెడ్డి వర్ధంతి సందర్భంగా జాతీయ స్థాయి కవితా పోటీల నిర్వహణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు నవభారత నిర్మాణ సంఘం అధ్యక్షుడు సూరేపల్లి రవికుమార్ తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తోపాటు వివిధ రాష్ట్రాలలో ఉన్న తెలుగు ప్రజలు ఈ కవితా పోటీలలో పాల్గొనవచ్చునని ఆయన తెలిపారు.

ఈ పోటీలకు పంపించే కవిత 20 నుంచి 25 వరసలు మాత్రమే ఉండాలని, తుది నిర్ణయం న్యాయనిర్ణేతలదేనని ఆయన స్పష్టం చేశారు. కవితా పోటీలలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.2,116, ద్వితీయ బహుమతి రూ.1,616, తృతీయ బహుమతి రూ.1,116, ప్రోత్సాహక బహుమతుల కింద రూ.516 నగదు ప్రదానం చేయనున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కవితలను ఈ నెల 20వ తేదీలోపు వాట్సాప్ నంబర్ 6303732862కు పంపించాలని పేర్కొన్నారు.

10, 11 తేదీల్లో జేఎన్‌టీయూ క్యాంపస్‌లో

మెగా జాబ్‌మేళా

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పరవస్తు క్రియేటివ్ ఫౌండేషన్, జేఎన్‌టీయూ, నిపుణ హ్యూమన్ డెవలప్‌మెంట్ సొసైటీ, హెచ్‌ఆర్ కో ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పరవస్తు ఫౌండేషన్ నిర్వాహకులు తెలిపారు. జేఎన్‌టీయూ క్యాంపస్‌లో ఈనెల 10, 11 తేదీల్లో నిర్వహించే జాబ్‌మేళాలో ఐటీ, ఫార్మా, ఐటీఈఎస్, మేనేజ్‌మెంట్, బ్యాంకింగ్, ఎఫ్‌ఎంసీజీ, రిటైల్ రంగాలకు చెందిన 100కు పైగా సంస్థలు భాగస్వాములుగా ఉన్నాయని అన్నారు. జాబ్‌మేళాలో 10 వేల మందికి ఉద్యోగాలు ఇచ్చే అవకాశం ఉందన్నారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు పాల్గొనవచ్చన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

పిల్లల పోషకాహారంలో మార్పులు అవసరం

- యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ జెలాలెమ్ టాఫెసర్

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రెండేళ్లలోపు చిన్నారులకు అందించే పోషకాహార పద్ధతుల్లో మరిన్ని మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని యూనిసెఫ్ ప్రతినిధి డాక్టర్ జెలాలెమ్ టాఫెసర్ అన్నారు. యూనిసెఫ్, సీఎస్‌బీసీ(సెంటర్ ఫర్ సోషల్ అండ్ బిహేవిరియల్ చేంజ్) సంయుక్తంగా హెచ్‌సీయూలో బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన మాట్లాడారు. చిన్నారులకు మంచి పోషకాహారాన్ని అలవాటు చేయడం, వారి జుట్టు దువ్వడం, స్నానం చేయడం వంటి ప్రవర్తనల్లో చేయాల్సిన మార్పులను రూపకల్పన చేసేందుకు ఈ వర్క్‌షాప్ ఎంతగానో దోహదపడిందని అన్నారు. వర్క్‌షాప్‌లో యూనిసెఫ్ ప్రతినిధులతో పాటు తెలంగాణ రాష్ట్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ అధికారులు, పోషకాహార నిపుణులు, క్షేత్ర పరిశోధకులు పాల్గొని పరిపూర్ణమైన ఆహార పద్ధతులను ప్రోత్సహించడానికి వ్యూహాలను రూపొందించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఆదిలాబాద్, కామారెడ్డి, గద్వాల జిల్లాల్లో చేసిన క్షేత్ర పరిశోధనల్లో వెలుగుచూసిన అంశాలపై విస్తృతంగా చర్చించామని ఆయన తెలిపారు. వర్క్‌షాప్‌లో ప్రొఫెసర్ వాసుకి బెలవాడి, ఉషా రామన్, డాక్టర్ రవికాంత్, ఆదిత్య లోమాస్ సీమా కుమార్ తదితరులు పాల్గొన్నారు.

20 ఏళ్లకే దారిదోపిడీలు, రౌడీషీట్

- ఐదుగురి అరెస్టు

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): 20 ఏళ్లకే దొంగతనాలు, దారిదోపిడీలకు పాల్పడుతూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న ఓ రౌడీషీటర్ సహా.. ఐదుగురిని సౌత్‌వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, కల్సుంపురా పోలీసులు కలిసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం టాస్క్‌ఫోర్స్ డీసీపీ సుధీంద్ర తెలిపిన వివరాల ప్రకారం.. కామాటిపురాకు చెందిన చౌకత్ ఆకాశ్ 20 ఏళ్లకే హత్యకేసు, దారిదోపిడీ కేసులో అరెస్టయ్యాడు. దాంతో అతనిపై రౌడీషీట్ నమోదైంది. తర్వాత మరో నలుగురు స్నేహితులు పర్వా విశాల్‌సింగ్, బిరదారా కిషన్‌రావు రోహిత్, సకత్ జితేందర్, గున్నాల ప్రదీప్‌తో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వారంతా 20 ఏళ్ల యువకులే. నగరంలో అర్ధరాత్రి తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి కత్తులతో బెదిరించి దారిదోపిడీలకు పాల్పడుతున్నారు.

ఈ క్రమంలో అర్ధరాత్రి స్నేహితుడితో కలిసి వెళ్తున్న డెలివరీ బాయ్‌ని అడ్డగించి కత్తులతో బెదిరించి, గాయపరిచి సెల్‌ఫోన్‌లు, నగదును లాక్కున్నారు. సౌత్‌వెస్ట్ జోన్ పోలీసులు నిఘా పెట్టి రౌడీల ముఠాను పట్టుకున్నారు.

ఐపీఓ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో

రూ. 6.14 లక్షలు లూటీ

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఐపీఓలలో పెట్టుబడి పెడితే అధిక లాభాలు ఆర్జించవచ్చని ఆశ పెట్టిన సైబర్ నేరగాళ్లు నగరవాసి(58) నుంచి రూ. 6.14 లక్షలు కాజేశారు. నగరవాసిని వాట్సాప్‌లో సంప్రదించిన సైబర్ నేరగాళ్లు ఐపీఓలో పెట్టుబడులు పెడితే తక్కువ సమయంలోనే ఎక్కువ లాభాలు వస్తాయని నమ్మించారు. ఇలా పలు సంస్థల ఐపీఓలలో పెట్టుబడుల పేరుతో రూ. 6.14 లక్షలు పెట్టించారు. పెట్టిన పెట్టుబడికి లాభాలు వచ్చాయని చూపారు. లాభాలు తిరిగి పెట్టుబడిగా పెట్టాలని సైబర్ నేరగాళ్లు ఒత్తిడి చేశారు.

డబ్బులు విత్‌డ్రా చేసుకునే అవకాశం లేకపోవడంతో బాధితుడు సైబర్ నేరగాళ్లను సంప్రదించాడు. ఖాతాలో ఉన్న డబ్బులో 10 శాతం చెల్లిస్తేనే విత్‌డ్రాకు అవకాశం ఇస్తానని చెప్పడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

'స్వచ్ఛదనం-పచ్చదనం'లో

ప్రజలు భాగస్వాములు కావాలి

రాంనగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ప్రజలు భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. బుధవారం అడిక్‌మెట్ డివిజన్‌లో నిర్వహించిన 'స్వచ్ఛదనం-పచ్చదనం'లో పాల్గొని చీపురు పట్టి చెత్తా చెదారాన్ని ఊడ్చి ఎత్తివేశారు. కార్యక్రమంలో డీఎంసీ ఖాదర్ మొయినుద్దీన్, ఏఎంవోహెచ్ మైత్రేయి, డీపీవో సుధాకర్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


గోల్నాక డివిజన్‌లో పాదయాత్ర చేసి సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, డీఎంసీ మారుతి తదితరులు


నల్లకుంటలో మట్టిని తొలగిస్తున్న కార్పొరేటర్ యాకర అమృత

- రిసాలగడ్డ, కల్లు కాంపౌండ్, పవిత్ర నగర్, ఉదయ్‌నగర్‌లో చెత్తాచెదారాన్ని కార్పొరేటర్ కె. రవిచారి దగ్గరుండి జీహెచ్ఎంసీ సిబ్బందితో తొలగింపచేశారు.

నల్లకుంటలో...

నల్లకుంట: విజ్ఞానపురి కాలనీ, టీచర్స్ కాలనీ, నర్సింహ బస్తీ, శివానందనగర్, మయూరి కాలనీ, ఫీవర్ ఆస్పత్రి చౌరస్తాలో మట్టికుప్పలను తొలగించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ యాకర అమృత, నోడల్ ఆఫీసర్ రవీందర్, ఏఈ దివ్య తదితరులు పాల్గొన్నారు.


అడిక్‌మెట్‌లో చీపురుతో చెత్తను తుడుస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

గోల్నాకలో..

గోల్నాక: సంజయ్‌గాంధీనగర్, నింబోలిఅడ్డ, దుర్గాసింగ్‌లేన్, ఎస్సీ హాస్టల్ లేన్, సుందర్‌నగర్ తదితర ప్రాంతాలలో చెత్తాచెదారం, మట్టి కుప్పలను తొలగించారు. కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్‌గౌడ్, డీఎంసీ మారుతి, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత తదితరులు పాదయాత్ర చేసి 'స్వచ్ఛదనం-పచ్చదనం' జరుగుతున్న తీరును పరిశీలించారు. మెడికల్ ఆఫీసర్, ఎస్.ఎస్. తిరుపతినాయక్, వర్క్ఇన్‌స్పెక్టర్ మనోహర్, మలేరియా విభాగం ఏఈ అంబిక తదితరులు పాల్గొన్నారు.

దేశప్రజల వారసత్వానికి ప్రతీక చేనేత రంగం


కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ తదితరులు

చిక్కడపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల వారసత్వానికి ప్రతీక చేనేతరంగం అని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ. పావని వినయ్‌కుమార్ అన్నారు. జాతీయ చేనేత దినోత్సవ వేడుకల్లో భాగంగా ముషీరాబాద్ నియోజకవర్గం పద్మశాలి ప్రజా సంఘం ఆధ్వర్యంలో బుధవారం అశోక్‌నగర్‌లో మాజీ మంత్రి, తెలంగాణ ఉద్యమనేత ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ నగరపాలిక సంఘటన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు గుర్రం శంకర్ మాట్లాడుతూ.. దేశంలో ముఖ్యమైన జీవనోపాధి రంగం చేనేత అని అన్నారు. ముషీరాబాద్ పద్మశాలి ప్రజాసంఘం ఉపాధ్యక్షులు ఎయిర్‌టెల్ రాజు, పున్న సత్యనారాయణ, మల్లికార్జున, శివకుమార్, బల్ల ప్రశాంత్, చింతకింది వంశీ, తాటిపాముల యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

బాగ్‌అంబర్‌పేటలో రూ. 16 లక్షలతో సీసీ రోడ్డు

నల్లకుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లయ్య ఆలయ వీధిలో రూ. 16 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డివిజన్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు సీహెచ్. చంద్రమోహన్, నాయకుడు మోర శ్రీరాములు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

వర్గీకరణలో వెనుకబడిన కులాలకు ప్రాధాన్యం ఇవ్వాలి


అభివాదం చేస్తున్న విముక్త చిరుతల కచ్చి, ఎమ్మార్పీఎస్, బీఎల్పీ నేతలు

రాంనగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణలో అత్యంత వెనుకబడిన ఉప కులాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. బుధవారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో విముక్త చిరుతల కచ్చి(వీసీకే) ఆధ్వర్యంలో ఎస్సీ వర్గీకరణలో ఉప కులాల కోటా అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వీసీకే చెన్నై హెడ్ క్వార్టర్స్ కార్యదర్శి బాలసింగం మాట్లాడుతూ.. సామాజిక న్యాయం అమలు కావాలని కోరే పార్టీగా వీసీకే వర్గీకరణను సమర్థిస్తుందన్నారు. ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పిడమర్తి రవి, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి కృపాకర్ మాదిగ, బీఎల్పీ అధ్యక్షుడు నల్లా సూర్యప్రకాష్, నాయకుడు పసునూరి రవీందర్ మాట్లాడుతూ.. కొన్ని శక్తులు వర్గీకరణ అమలు కాకుండా అడ్డుపడుతున్నాయన్నారు. కార్యక్రమంలో వీసీకే సెంట్రల్ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మచ్చ దేవేందర్, ప్రధాన కార్యదర్శి చెరిపెల్లి ఆనంద్, కోశాధికారి దానబోయిన రవి, కార్యదర్శులు నల్లా రమేష్, కిరణ్, అంజయ్య, కోటేశ్వరరావు, ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్ పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

చేవెళ్లలో ఇచ్చిన హామీలను అమలు చేయండి

కవాడిగూడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ చేవెళ్లలో ఎస్సీ డిక్లరేషన్ సభలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ డిమాండ్ చేశారు. బుధవారం బీజేపీ ఎస్సీ మోర్చా ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ పి. పరశురాం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కొర్రా రాణాప్రతాప్‌సింగ్‌కు బీజేపీ ఎస్సీ మోర్చా నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. చేవెళ్లలో దళితులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా నగర అధ్యక్షుడు ఎస్. రాజు, ముషీరాబాద్ నియోజకవర్గం కన్వీనర్ ఎం. రమేష్ రాం, బీజేపీ నాయకులు జి. వెంకటేష్, కె. పరిమళ్‌కుమార్, మహాకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'దోమల నివారణలో జీహెచ్ఎంసీ విఫలం'

రాంనగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రోగ్రెసివ్ యూత్ లీగ్ (పీవైఎల్) ఆధ్వర్యంలో అడిక్‌మెట్ డివిజన్‌లో లలితానగర్, విద్యానగర్ తదితర ప్రాంతాలలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్. ప్రదీప్ మాట్లాడుతూ.. దోమల నివారణకు ఫాగింగ్ చేయడంలో జీహెచ్ఎంసీ విఫలమైందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, కృష్ణ, కిరణ్, శ్రీనివాస్, మల్లేష్, బాలు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పీర్లకు దట్టీల సమర్పణ

ముషీరాబాద్ , ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అమర్‌ఖానా ఉత్సవాలు రెండో రోజు బుధవారం ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు ముఠా జైసింహ ప్రార్థనలు చేసి పీర్లకు దట్టీలు సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై. శ్రీనివాస్‌రావు, ముషీరాబాద్ డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు పర్వేజ్, మాజీ కార్పొరేటర్ వాజిద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

మహాత్మాగాంధీ శాంతి పురస్కార్‌కు

డాక్టర్ మర్రి రాజిరెడ్డి ఎంపిక



బర్కత్‌పుర, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ సేవాదళ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ మర్రి రాజిరెడ్డిని ఈ ఏడాది మహాత్మాగాంధీ శాంతి పురస్కార్‌కు ఎంపిక చేసినట్లు తెలంగాణ సిటిజన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ తెలిపారు. పర్యావరణం, శాంతి, జాతీయ సమైక్యత, మతసామరస్యం, గ్రామీణ అభివృద్ధి, వైద్య, ఆరోగ్య రంగాలలో 20 ఏళ్ళుగా పేదలకు సేవ చేస్తున్నందుకు ఈ అవార్డుకు ఎంపిక చేశామన్నారు.

బుధవారం బర్కత్‌పురలోని సిటిజన్ కౌన్సిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 9న క్విట్ ఇండియా డే సందర్భంగా ఆయనకు అవార్డు ప్రదానం చేస్తామని తెలిపారు.

'పేదల ఆకలి తీర్చడానికి అన్నదానాలు దోహదం'

బర్కత్‌పుర, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పేదల ఆకలి తీర్చడానికి అన్నదాన కార్యక్రమాలు దోహదపడతాయని ప్రముఖ సంఘసేవకుడు రాగిపణి ప్రవీణ్‌కుమార్ అన్నారు. బోనాల వేడుకల ముగింపు సందర్భంగా నింబోలిఅడ్డ మహాకాళి అమ్మవారి ఆలయం వద్ద బుధవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, సుభాష్‌పటేల్, దేవేందర్‌గౌడ్, బి. కృష్ణాగౌడ్, మురళీధర్ గౌడ్, రాఘవేంద్రా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి ఏర్పాటుకు చర్యలు

నల్లకుంట, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బోనాల పండుగలో భవిష్యవాణిలో అమ్మవారు చెప్పినట్లుగా అంబర్‌పేట దేవస్థాన సేవా సమితి ఆధ్వర్యంలో బొడ్రాయి(పోతలింగన్న)ని మరోచోట ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టారు. బుధవారం దేవస్థాన సేవా సమితి ప్రతినిధులు బైండ్ల పూజారి నగేష్‌తో కలిసి గాంధీ బొమ్మ వద్ద ఉన్న బొడ్రాయిని సందర్శించారు. ఈ సందర్భంగా దేవస్థాన సేవా సమితి చైర్మన్ పంజాల జ్ఞానేశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ.. ఫ్లైఓవర్ నిర్మాణం వల్ల బొడ్రాయి రోడ్డు మధ్యలోకి రావడంతో మరోచోట ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థాన సేవా సమితి వైస్ చైర్మన్ గడ్డం లక్ష్మణ్‌గౌడ్, అధ్యక్షుడు వై.శంకర్‌గౌడ్, ఉపాధ్యక్షుడు రంగంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


వెంకటేష్

చిక్కడపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన ఎస్. వెంకటేష్(30) ఆన్‌లైన్‌లో జాబ్ చేస్తుంటాడు. ఈనెల 6వ తేదీన బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు అతడికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. వెంకటేష్ ఆచూకీ లభించకపోవడంతో తల్లి వరలక్ష్మి చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.


ప్లాస్టిక్ టబ్‌లను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, డీఎంసీ

ప్లాస్టిక్ టబ్‌ల పంపిణీ

బర్కత్‌పుర, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌ను పరిశుభ్రమైన డివిజన్‌గా తీర్చిదిద్దడానికి ప్రజలు సహకారం అందించాలని కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్‌వో హేమలత కోరారు. చెత్తను స్వచ్ఛ ఆటోల్లో వేయాలని, రోడ్లమీద వేయొద్దన్నారు. బుధవారం చప్పల్‌బజార్, ఎస్వీఎస్ ఆస్పత్రి లేన్, ప్రభాస్ టాకీస్ తదితర ప్రాంతాల్లో ప్లాస్టిక్ టబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు క్షీరసాగర్, వాసు, దిలీప్, లావణ్య, తారా, శ్రీనివాస్, ఆర్ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

'బహుముఖ ప్రజ్ఞాశాలి పోతుకూచి'

చిక్కడపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పోతుకూచి సాంబశివరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని పలువురు సాహితీవేత్తలు పేర్కొన్నారు. బుధవారం అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన్ తెలంగాణ శాఖ ఆధ్వర్యంలో డా. పోతుకూచి సాంబశివరావు 7వ వర్ధంతి సభ అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్‌లో సాహితీవేత్త డా. కడారి సత్యమూర్తి అధ్యక్షతన జరిగింది. తెలుగు యూనివర్సిటీ పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరీశంకర్ పోతుకూచి సంస్మరణ సంచికను ఆవిష్కరించారు. సాధన నరసింహాచార్య, పొత్తూరి సుబ్బారావు, తంగిరాల చక్రవర్తి, పద్మావతి బాలగంగాధరయ్య, కూర చిదంబరం, కాశీవిశ్వేశ్వరరావు, హనుమాన్, దశరథరామయ్య పాల్గొన్నారు.


ఏపూరి సోమన్నకు అవార్డు బహూకరిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

ఏపూరి సోమన్నకు ప్రతిభా అవార్డు

చిక్కడపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): త్యాగరాయగానసభలో ఎస్ఎల్‌పీ ప్రజాసేవలో మేము సైతం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాకార్, సేవారత్న అవార్డుల బహూకరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న టీపీసీసీ ప్రచార కమిటీ రాష్ట్ర కో-కన్వీనర్, అంతర్జాతీయ ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గుప్తా ప్రముఖ గాయకుడు ఏపూరి సోమన్నకు ప్రతిభా అవార్డు బహూకరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక చైర్మన్, ప్రముఖ గాయని లక్ష్మీప్రసన్న, కటకం శ్రీనివాస్, వి. అంజయ్య, స్వామి సంతోష్, ఎల్‌వీ కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

బర్కత్‌పుర, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం ఉందానగర్ రైల్వే స్టేషన్ సమీపంలో 40ఏళ్ళ వయసు గల గుర్తు తెలియని వ్యక్తి రైలుకు ఎదురు వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైలులో ప్రయాణికుడి బ్యాగ్ చోరీ

రైలులో ప్రయాణికుడి బ్యాగ్ చోరీ అయింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. గుడిమల్కాపూర్‌లో నివసిస్తున్న రవికుమార్ అజంతా ఎక్స్‌ప్రెస్‌లో కాచిగూడ వస్తున్నాడు. నాందేడ్ సమీపంలో అతడి బ్యాగ్‌ను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. బుధవారం కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. బ్యాగ్‌లో గ్రాము గోల్డ్ చెయిన్ రూ. 4 వేలు, సెల్‌ఫోన్ ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏడీఈ ప్రేమానంద్ పాయ్ తెలిపారు. తాళ్లబస్తీ, గుల్షన్‌నగర్ ఫీడర్ల పరిధుల్లో గాంధీనగర్ నాలా, ఘంటసాల పార్కు తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు, బ్యాంక్ ఆఫ్ బరోడా పరిధిలోని నర్మదనర్సింగ్‌హోమ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఇంటి ప్రాంతం పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు, భోలక్‌పూర్ పరిధిలోని టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ ప్రాంతం, శివాలయ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు సరఫరా విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ పేర్కొన్నారు.

'లైబ్రరీ ఆవరణలో ఆందోళన చేస్తే చర్యలు'

చిక్కడపల్లి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయ ఆవరణలో అనుమతి లేకుండా సమావేశాలు, ఆందోళనలు నిర్వహించరాదని గ్రంథాలయ కార్యదర్శి పొట్టూరు పద్మజ సూచించారు. బుధవారం మధ్యాహ్నం ఆమె తన కార్యాలయంలో మాట్లాడుతూ.. ఆందోళనలు నిర్వహించే వారిని గ్రంథాలయంలోకి అనుమతించబోమని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ముషీరాబాద్ , ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న 32 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 9,16,500 విలువగల చెక్కులు మంజూరయ్యారు. బుధవారం వారికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

పటాన్‌బస్తీలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ముషీరాబాద్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): హై ఓల్టేజీ సమస్యలను పరిష్కరించేందుకు ముషీరాబాద్‌లో అవసరమైనచోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. బుధవారం పటాన్‌బస్తీలో జనావాసాల మధ్య ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి మరోచోట ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను డీఈ కమల్‌కుమార్ శర్మ, ఏఈ సునీల్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, శ్రీధర్ రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీధర్‌చారి పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లు పెంచాలి


మాట్లాడుతున్న బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్

రాంనగర్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లను పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరె మహేందర్ డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలో సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలకు డిప్యూటీ సీఎం పదవి ఇవ్వాలని, కేంద్రంలో బీసీ మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు మేడవరపు రాజేష్‌కుమార్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం

కవాడిగూడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గాంధీనగర్ సీఐ డి. రాజు తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 40 నుంచి 45 సవత్సరాల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి బోయిగూడలో మెట్రోస్టేషన్ ఫుట్‌పాత్‌పై చనిపోయి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు యాచకుడని భావిస్తున్నారు.